



**ఆ**రోజు బలికాబోతున్న కోడిపుంజు గురించిన దిగులుతో లేవబుద్ధికాక అలాగే పడుకుని వుంది వరాలు.

**చే**ల్లటి నీళ్ళుమొహం మీదపడే సరికి రెండు చేతుల్తో మొహాన్ని కప్పుకుంటూ అటువేపుకు

తిరిగి పడుకుంది వరాలు.

వాళ్లమ్మ చెంగమ్మ పోతూ పోతూ ఇన్ని నీళ్లు చల్లిపోయింది వరాలు మీద.

'ఓమ్మే! వొరాలూ... సగలమ్మ కాడికి బోవాల గాదా' అంది కుండెడు నీళ్లల్లో పేడకలుపుతూ.

మామూలుగా అయితే అంత తొందరగా ఎప్పుడూ లేవని వరాలు 'సగలమ్మ' అనే మాట విన బడేసరికి దిగ్గునలేచి కూర్చుని అరుగుమీద నించి కిందికి చూసింది.

కోడిపుంజు మంచానికి కట్టేసి వుంది. ఠీవిగా నిలబడి తలను అటూ ఇటూ కదుపుతూంటే నెత్తి మీద ఎర్రటి కిరీటం రాజసంతో కదుల్తోంది. ముదురు పసుపు రంగులో వున్న కంటి మధ్య గుండ్రటి నల్లగుడ్డు నిర్భీతితో మెరుస్తోంది. రానున్న ఆపదను ఏమాత్రం పసిగట్టలేనంత అమాయ కత్వంతో కూడుకున్న నిర్భీతి! ఒళ్లంతా నలుపు, ఎరుపు ఈకల కలనేత మెరుపులు.

గబగబా అరుగుదిగి కోడి దగ్గరకు వెళ్ళింది వరాలు. కోడి భయంతో క్రో... క్రో అంటూ కాలికి కట్టేన తాడును లాక్కుపోవాలని ప్రయత్నిస్తోంది.

చెంగమ్మ కూతురువేపు మురిపెంగా చూస్తూ 'మ్మే! పోమ్మే!! నీళ్లు దేపోమ్మే...' అని తన తల్లి పారవతమ్మ వేపు తిరిగి 'కోణ్ణి కూరొండినాక జాచ్చి చీలు దినేదిదే. బలే మిడిమేలపు ముండగని' అంది. పారవతమ్మ సన్న సన్న పుల్లలు విరుస్తూ నవ్వుతూ చూసింది.

'హూ' అని తల విదిలించుకుంటూ లేచి గూట్లోంచి ఓ బొగ్గుతీసి నోట్లో వేసుకుని కరకర నమిలి చూపుడువేలుతో పళ్లు రుద్దుకోవడం ప్రారంభించింది.

గోడ దగ్గరికి వెళ్ళి గోడ మీద తుపుక్కుమని వుమ్మేసింది.

శిధిలమై సున్నపు పెచ్చులు వూడి లోపలి బంక మట్టీ, రాళ్ళూ కనిపిస్తున్న గోడ మీద నల్లటి ఎంగిలి పడింది.

'మెడ్తో గొడ్తా! లంజముండా' అని చివాలున లేచిన చెంగమ్మకు దొరక్కుండా బయటికి పరుగెత్తింది వరాలు.

'ఏమి దీనికి బొయ్యేకాలం... కండ్లగావరం' అంది పారవతమ్మ. పారవతమ్మకు ఆ ఇల్లంత అపురూపమైంది ఇంకోటి లేదు. ఆ ఇంటిని స్వంత చేతుల్తో కట్టింది పారవతమ్మ. అప్పటికి ఆమె కూతురు చెంగమ్మ వరాలంత వుండేది. బంక మట్టిని పిసికింది. రాళ్ళు పేర్చింది. వాసాలు కూర్చింది. కొండమీద 'బోద'ను కోసుకొచ్చి ఇంటిమీద




కప్పింది. ఇప్పుడు ఆ బోదంతా ఏళ్ల తరబడీ ఎండ ల్నీ, వానల్నీ ఎదుర్కొనీ ఎదుర్కొనీ నల్లబడిపోయింది. ముట్టుకుంటే నుసి నుసయిపోతోంది.

కప్పు అడుగున వున్న వాసాలూ, దూలాలూ కూడా నిరంతరం తగిలే పొగవల్ల నల్లటి కాటుక రంగుకి తిరిగాయి.

ఆ ఇంటికి చుట్టూ మనిషెత్తు ప్రహరీ గోడ. ప్రహరీ గోడకూ, ఇంటికీ వున్న ఖాళీ స్థలంలో ఉపరితలంలో పోసిన మట్టి- చీపురుకట్ట వూడ్పులకు ఎగిరిపోయి అడుగునున్న గులకరాళ్లు పొడుచుకుని వచ్చి నేలంతా ఎగుడుదిగుడుగా తయారయ్యింది. అయినా సరే ఆ నేల మీదే పేడ చల్లడం ముగ్గులు పెట్టడం... ఆ గోడలకే సంవత్సరం సంవత్సరం సున్నాలు పూయడం! ఎరమట్టి గీతలు గీయడం!!

అయితే వరాలు కివ్వేమీ పట్టవు. ఎంతసేపూ ఏదో ఒకటి పాడుచేసి తిట్లు తినడం సరదా. అట్లా అందరూ తనను ఎంత గట్టిగా కేకలేస్తూ వుంటే తన వునికిని అంత గాఢంగా అనుభూతి చెందుతుంది.

పారవతమ్మ చెంగమ్మను పొయ్యి వెలిగించమని పురమాయించి సగలమ్మ మొక్కుకు కావాల్సిన ఏర్పాట్లలో మునిగిపోయింది. లోపలి తలుపుకు ఇటూ, అటూ వున్న రెండు పెద్ద పెద్ద అరుగులకు చిక్కటి పేడ నీళ్ళు పులుముతోంది. మధ్యలో వేసిన గోనెపట్టతో ఆడుకుంటున్న రెండు బూడిద రంగు పిల్లి పిల్లలు కాళ్లకు మాటి మాటికీ అడ్డుపడుతుంటే చేత్తో అవతలికి తోసి 'ఛేయ్' అని అరిచింది పారవతమ్మ.

ఆ రెండు పిల్లి పిల్లలూ కింద ఓ దొర్లు దొర్లి, లేచి నిలబడి విస్మయంగా పారవతమ్మకేసి చూసి గబగబా ఇంట్లోకెళ్ళాయి. మళ్లీ అంతలోనే ఒకదాన్నొకటి తరుముకుంటూ వచ్చి ఆగిపోయి పారవతమ్మకేసి చూడబోయిన వాటి దృష్టిలో అప్పుడే నేలమీద వాలిన ఓ ఈగ పడింది. చెవులు రిక్కించి, పొంచి వుండి శత్రువు మీదికి రహస్యంగా దాడిచేసే వాళ్లలా ... శరీరాన్ని వెనక్కిలాగి ముందు కాళ్లతో మెల్లి మెల్లిగా ఈగ దగ్గరకు వస్తున్న పిల్లి పిల్లలు రెండూ దూలం చాటునించి వాళ్లమ్మ అరుపువిని చప్పున ఆగిపోయి తోకల్ని నిటారుగా ఎత్తి, నడుమును తలక్రిందులైన అర్థచంద్రుడి ఆకారంలోకి మార్చి గొప్ప ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ బొమ్మల్లా నిల్చుండిపోయాయి.


పొగవల్ల మండుతున్న కళ్లని కొంగుతో తుడుచుకుంటూ

'వొసే నా సయితీ.. వొరాలూ.. నీళ్లు తీసక రాయే.. మళ్లా ఫవరు తగ్గిపోతాది' అని కేకవేసింది చెంగమ్మ. చుట్టుపక్కల ఎక్కడున్నా వరాలుకు వినపడే స్థాయిలో వుంది ఆ కేక.

బయట గులకరాళ్లదారి మీద రాత్రి కురిసిన వాన నీళ్లకు ఎడంకాలి బొటనవేలుతో కాలువలు తీస్తూ నిలబడి వుంది వరాలు. నోట్లో యాంత్రికంగా పళ్లను తోముతోంది చూపుడువేలుతో.

వరాలు మనసులో ఆ రోజు సగలమ్మ బలి కాబోయే తన కోడిపుంజు మెదులుతోంది. గుడ్డులో నుంచి బయట పడినప్పట్నించి తెలుసు తనకది. చిన్నప్పుడు దాన్ని నెత్తి మీదికి ఎక్కించుకుంటే అది తన చిట్టి చిట్టి గోళ్లతో మీదమీదికి దిగి గిలిగింతలు పుట్టించిన దృశ్యం కళ్లముందు పదే పదే మెదులుతోంది.

దూదిలాంటి మెత్తటి పిల్ల... ఎంతగా ఎదిగింది తన చేతుల్లో! ఈ రోజుతో ఆఖరా దానితో తన సంబంధం!




తల్లి చెంగమ్మ కుడి చేతితో పూదురుగొట్టం తో, ఎడం చేత్తో బిందెతో బయటికి వచ్చింది.

'మెట్టుతో పదారేట్లు గొడతాయెంచి లంజా' అని అరిచింది.

వరాలు వులిక్కిపడి వాళ్లమ్మకు అందకుండా కొంచెం దూరం పరుగెత్తి 'ఆడబెట్టు బింది' అంది.

వాళ్లమ్మ బిందెను అక్కడ బెట్టి 'ఇంట్లోకి రాయే వుండాది నీకత' అని లోపలికి వెళ్ళిపోయింది.

వరాలు బిందెను ఎడం చేత్తో నిర్లక్ష్యంగా పట్టుకుని జవహర్ రోజ్‌గార్ నీళ్లకోసం వెళ్తూంటే మట్టి గొట్టుకుని వున్న వరాలు జానెడు జడ గంజి పెట్టినట్టు బిరుసుగా వుంది.

ఇంట్లోంచి రాయుడు ఒళ్ళు విరుచుకుంటూ లేచివచ్చాడు. అతడు చెంగమ్మ రెండో కొడుకు. అతడి వుంగరాల జుట్టు రాత్రి పడుకోబోయే ముందు ఎలా వుందో ఇప్పుడూ అలాగే వుంది. నెల రోజుల్నించీ గడ్డం పెంచుకుంటున్నాడు తిరుపతికి పోవాలని.

'ఏం బ్బీ! లేచినావా. రా. నాయినా! నువ్వు ముందు బోసుకుంటే నీళ్లు మళ్ల నేనూ, వరాలూ బోసుకుంటాం' అంది పారవతమ్మ.

రాయుడు బ్రష్ మీద పేస్ట్ వేసుకుని పళ్లు తోముకుంటూ తుమ్మ చెట్టు ఇవతల 'జాలారి' దగ్గరికి వచ్చాడు. జాలారి అంటే కింద పరచబడిన నాలుగు బండలు. ఓ బండ మీద పెద్ద నీళ్ల మట్టి తొట్టి. అక్కడే పడే కొన్ని నీళ్లు బండల అడుగున వున్న చిన్న కాలవగుండా బయటికిపోతే కొన్ని నీళ్లు పక్కనే వున్న ముద్దబంతి, మల్లె, సన్నజాజి, బొప్పాయి పాదుల్లోకి పోతాయి.

రాయుడు టవలుతో వొళ్లు తుడుచుకుని వచ్చి మంచం మీద ఒక పక్కకు పడుకుని కిందికి వొరిగి కోడిపుంజు వేపు చేయి సాచాడు. అది ఎగరాలని ప్రయత్నించి బోర్లా పడింది కెక్కిరిస్తూ.

'కేజీ వుంటాదా ఇది' అన్నాడు రాయుడు కోడి పుంజునుద్దేశించి

''మ్మేయ్! వొరాలూ, నువ్వు బొయ్యి కొండయ్యంటి కాడ అన్న కంట దోసితేమ్మే'' అంది పార్వతమ్మ కొంగు విప్పుతూ.

''ఉప్మాజేస్తే బొయ్యేది గదుమ్మా. అందరూ దినే వాళ్ళము'' అంది పొయ్యి మీద బానలో రాయుడు పోసుకోగా ఏర్పడిన వెలితిని చల్లనీళ్ళతో నింపుతూ, చెంగమ్మ.

''అబ్బి తిండు లేమ్మే. నువ్ బోమ్మే వరాలూ'' అంది పారవతమ్మ, అయిదు రూపాయల నోటిస్తూ.

''ఇదో వరాలూ! లోపల నా చొక్కా జేబీలో వుండాది గని లెక్క... తీసుగోని పో'' అన్నాడు రాయుడు.

''వొద్దు లేస్నా'' అని అరుస్తూ బయటికి పరుగెత్తింది వరాలు.

రాయుడు మనసులో నవ్వుకున్నాడు.

'ఈ మర్యాదలు ఎంతకాలం!?' నాలుగేళ్ళయింది తను ఇంట్లోంచి పారిపోయి. నిన్ననే వచ్చాడు మళ్ళీ వీళ్ళ మధ్యకు. అందుకే ఈ దోసెలూ... ఈ కోళ్ళు కోసి వండటాలూ... ఇంక నాల్రోజులు పోతే మళ్ళీ మామూలే.

'నా బట్టా... నా కొడకా... సద్ది కూడు...'

ఓ నవ్వు అతడి పెదాల మీద మెదిలింది. ఆ నవ్వులో ఆ తాత్వికతతో బాటు, అందుకు పూర్తిగా వ్యతిరేకమయిన అహంకారం - తను లోకాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నానన్న అహంకారం కూడా కలిసి వుంది.

అంతలో చెంగమ్మ భర్త శంకరయ్య చేతి సంచీతో లోపలికి వచ్చాడు. బట్టతల మీద మెరుస్తున్న చెమట బిందువుల్ని బుజాన వున్న టవలుతో తుడుచుకున్నాడు. కళ్ళు నిలకడలేకుండా అటూ ఇటూ కదులుతున్నాయి. సన్నగా రివటలా వున్న శంకరయ్య మల్లెపువ్వు లాంటి తెల్లటి లాల్చీ, పంచ కట్టుకొని వున్నాడు.

''ఏమి బ్బీ! నాస్తా చేసినావా?'' అన్నాడు కొడుకు వేపు చూస్తూ. ఎవరో తరుముతున్నట్టుంటాయి అతడి మాటలు.

''ఓయ్యా! నాయనా! ఇప్పుటికయిపొయ్యిందా నీ బజారు...'' అంది చెంగమ్మ బియ్యంలో రాళ్ళేరుతూ.

శంకరయ్య మాట్లాడకుండా సంచీలోంచి శనగపిండి పొట్లం, తమలపాకులు, వక్కలు, కుంకుమ, పసుపు, మల్లెపూలు, అరటిపండ్లు, కొబ్బరి కాయలు, జేబులోంచి చిన్న కర్పూరం పొట్లం తీసి అరుగుమీద పెట్టాడు.

చెంగమ్మ కళ్ళు ఇంతవి చేసి కొబ్బరి కాయను చేతికి తీసుకొని -

''ఓయ్యో! ఇదేంది టెంకాయా! ఇదేంది ఇంత వులకంగా వుండాది ... దీంట్లో కొబ్బిరుంటాదా?'' అంది.

శంకరయ్యకు చిర్రెత్తి పోయింది ''ఇంగే ముంటాది'' అన్నాడు.

''ఓయ్యా! నాయనా! ఏదో ఒకట్లే కానీ'' అంది వుతికిన గుడ్డలో బెల్లం పెట్టి గుండ్రాయితో నలగ్గొడుతున్న పారవతమ్మ, మధ్యలో కలగజేసుకుని.

చెంగమ్మ నాలుగు బియ్యం గింజల్ని నోట్లో వేసుకుని,

వాళ్లమ్మ చెంగమ్మతో.

'కేజీ యేం కేజీరా! ఒకట్నర కేజీపై నుండాదయితే' అంది చెంగమ్మ.

'మ్మేయ్! ఈ వొరాలు ముండ యాడికి బోతే ఆడ్నే. అబ్బికి నాస్తా అన్నా తెచ్చాదనుకుంటే' అంది బయటికి తలుపువైపు చూస్తూ.

వరాలు చంకలో బిందె పెట్టుకుని గబగబా వచ్చింది. బిందెకున్న చిల్లులోంచి సన్నటి ధార పడుతుంటే.

'వుచ్చ... వుచ్చ... చూడండి' అని నవ్వుతోంది. వరాలు హాస్యాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అయినా ఇది ఒకళ్ల కోసం సృష్టించబడిన హాస్యం కాదని వరాలు మొహంలో స్పష్టంగానే వుంది. తన

మనసులో కోడి తాలూకు బాధను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని సులభంగానే తెలుస్తోంది.

''నిన్న తెచ్చిన చెనిగిపిండి ఎవురి దెగ్గిర దెచ్చినావు? పిండి తక్కువగాని. ఈ పొద్దు తూంచితే తెలుచ్చుంది ... వాడి రంగం... నీ రంగం...'' అంది తాపీగా. శంకరయ్య తత్తర బిత్తరగా రెచ్చిపోయాడు.

''నారంగమేం తెలుచ్చాదిలేయే. అచ్చుమయ్య వోటలు కూడా దెలీలా నీ రంగం.''

''ఇంగ బోనీమ్మే తల్లీ... నా తల్లీ'' అంది పారవతమ్మ. పొడిచేసిన బెల్లం పక్కనబెట్టి విరి మల్లె పూలూ, దారం చేతికి తీసుకుంటూ.

వరాలు టిఫిన్ తెచ్చి రాయుడికి ఇచ్చి చిన్న మట్టి గిన్నెలో నీళ్ళు తీసుకొని కోడిపుంజు ఎదురుగా పెట్టి చూస్తూ కూచుంది.

ఇంతలో ఓ కాకి మట్టి గోడ మీద కూచుని వూరికే అరవడం మొదలెట్టింది.

''వరాలూ... తోలు... తోలే... కాకిని... బందుగు లేమన్నా దిగుతారో! ఏం శనిద్రమో...!!'' అంది చెంగమ్మ.

''దిగనీలే. తీమ్మా'' అంది వరాలు. కోడి తలను పట్టుకుని నీళ్ళ గిన్నెలో ముంచుతూ.

''నీకు ముదిగారం చానా జాచ్చయుండాది. దించుతా'' అని చేతిలో వున్న పెద్ద మట్టి బెడ్డను కాకి వేపు విసిరింది, 'ష్' అంటూ. కాకి ఎగిరిపోయింది.


బందువులంటే చెంగమ్మ భయపడ్డంలో పెద్ద ఆశ్చర్యమేం లేదు. చెంగమ్మ పొద్దునంతా కష్టపడి బోండాలు చేస్తే శంకరయ్య సాయంత్రం దాకా బస్టాండులో వచ్చే పోయే బస్సుల దగ్గర తిరిగి అమ్మి రోజుకు పది రూపాయల దాకా సంపాదిస్తాడు. అందులోనే పారవతమ్మ, చెంగమ్మ, శంకరయ్య, వరాలు తిండీ, తిప్పలు గడవాలి. ఇది వరకంటె పార వతమ్మ పాలు పోసేది. ఇప్పుడు నడుముల నొప్పుల్తో ఎక్కువ దూరం తిరగలేదు. వరాలు చేసే పిడకలు గానీ, నాట్ల కాలంలో వరాలు సంపాదించేది కానీ ఆ కుటుంబానికి ఎలాంటి ఆసరా అని అనడానికి వీల్లేదు.

అంతలో పిల్లిపిల్లలు అరుచుకుంటూ చెంగమ్మ చుట్టూ తిరగడం ప్రారంభించాయి. చెంగమ్మ వరాల్ని బతిమిలాడింది.

''మ్మేయ్. వరాలూ. నా తల్లీ ఈ అర్ధ రూపాయికి పాలు దెచ్చి ఈటికి పొయ్యే. పెరుగు ముండ రాలా! ఇంట్లో అన్నమూ లేదు'' అని.

అయితే వరాలుకి కోడిని వదిలి వెళ్ళాలని లేదు. పాలంటే అరమైలు దూరం పోయి రావాలి.

''ఒసే నా తల్లీ! ఆ కోణ్ణేం మూచ్చావ్ పోమ్మా! సగలమ్మ తల్లి వుండాది అన్నిటికి పైన. నీకు మంచి మొగుడొచ్తాడు.''




''ఆ తల్లి సలవుంటే కోయేటి (కువైట్) నించి మీ పెద్దన్న దండిగా లెక్క పంపిస్తాడు లేమ్మా! పో నా తల్లీ!!'' అని వరాలు గడ్డం పట్టుకుంది.

వరాలు అయిష్టంగా లేచింది.

వరాలు పాలు తీసుకొచ్చేటప్పటికి -

ప్రకాశంగా వెలుగుతున్న ఆకాశం కింద సగ లమ్మ మొక్కుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లూ సిద్ధ మయ్యాయి.

పెద్ద గంపకు పేడ అలికి, ఎర్ర మట్టి చారలు పూశారు. నల్లటి నూలుదారం గంప చుట్టూ చుట్టి మధ్య మధ్య వేప మండలు వేలాడదీశారు. గంపలో సిల్వర్ గిన్నెలో కడిగిన బియ్యమూ, నీళ్ళూ ఇంకా పూజకు కావల్సిన సామాగ్రంతా సర్దేరు.

రెండు కాళ్ళూ కట్టేసిన కోడిని శంకరయ్య చంకలో పెట్టుకున్నాడు. చెంగమ్మ గంపనెత్తి మీదికి ఎత్తుకుంటూంటే వాళ్ళమ్మ పారవతమ్మ సాయం చేసింది.

''ఓమ్మో! సూరు కత్తి... సూరు కత్తి యాడ దీసుకున్నాం'' అని అరిచింది, చెంగమ్మ.

పారవతమ్మ గబగబా ఇంట్లోకి పోయి ఓ కత్తిని తెచ్చి గంపలో ఒక వైపుకి దోపింది, వరాలు రెప్ప కూడా వెయ్యకుండా ఆ కత్తి వేపు చూస్తుండగా.

అందరూ బయలుదేరారు. శంకరయ్య, రాయుడూ కొంచెం ముందూ చెంగమ్మ, పారవతమ్మ, వరాలు కొంచెం వెనక. వరాలు చూపంతా శంకరయ్య చంకలో వున్న కోడిమీదే వుంది.

చెరువు కట్ట చేరుకున్నారు. అక్కణ్ణించి ఇంకా రెండు ఫర్లాంగులుంటుంది సగలమ్మ చెట్టు. దూరంగా కనిపిస్తోంది. తన కోడిని కబళించబోతున్న సగలమ్మంటే చాలా కోపంగా వుంది వరాలుకి.

''అమ్మా! సగలమ్మంటే ఎవురే?'' అంది. చెంగమ్మ నెత్తిమీది గంపను కొద్దిగా ఇంకో వైపుకి తల మీదే సర్దుకుంది, చెంగమ్మ.


''సగలమ్మ ఎవురంటే ఏం జెప్తామె పిల్లా! కాపోళ్ళమె! వాళ్ళ నాయన ఆచ్చీ, పాచ్చీ అన్ని అమ్ముకోని చెరువుకట్ట కట్టిచ్చినాడంట, ఎన్ని మాట్లు గట్టినా కట్ట నిల్వడం లేదంట. రోజూ వొడ్డోళ్ళను దీసకపొయ్యి కట్ట గట్టించేదీ... మళ్ళా పొద్దనే జూస్తే కట్టుండేది గాదంట.

ఇంగాయన 'అన్నం దినకుండా, నీళ్ళు దాక్కుండా పండుకోనుంటే ఈ సగలమ్మ తల్లి. బొయ్యి 'ఏం నాయనా అట్ల బండుకోనుండావు' అంటే 'ఈ మాదిరి అయిపోయుండాదమ్మా పరిచ్చితి' అన్నేడు - అంటే అప్పుడు సగలమ్మ 'నువ్వు లెయ్యి నాయనా! నీకేంటికి నేనుండా పా' అని తానం జేసి, పెండ్లి కుమార్తె మాదిరి తయారయ్యి, గడ్డపార బుజానేసుకోని నాయన్ను ఎంట తీసుకోని సెరువెంబడి బయలుదేరిందంట. అంతే - వాళ్ళ నాయన చూచ్చా వుండంగానే ఆ తల్లి పామయి పొయ్యి ఆడెత్తిన పడగ దించకుండా...'' అని ఆపింది చెంగమ్మ. తల్లి వేపు చూసి ''ఏమ్మా! పామయి పోయిండ్లా? అనడిగింది. అక్కణ్ణించి పారవతమ్మ చెప్పుకొచ్చింది.

''ఆ! గాలా...! పాము? ... నాయినా ఈ మాదిరి నేను పామయి పోతాండాను. నా యెంబడి సెరువుకట్ట కట్టేసుకుంటా... రా..! కొనా మొదులుకు అనిందంట...''

''అంటే ఆడమనిషి పామయి పోయిందావ్వా'' అడిగింది వొరాలు కళ్ళు పెద్దవి చేసి. వరాలు గుండెలు జల్లుమన్నాయి.

''పాము గాదుమ్మే... పాము అవుతారమ్మే




పోయింది. ఇంగాపాట్నా కట్టటన్నే నిలబడి బొయ్యింది. ఇంగాణ్ణేచి సగలమ్మ దేవతై పొయ్యింది.

ఎవురన్నా పెండ్లిండ్లకు బోతా 'ఓ సగలమ్మ తల్లీ! పెండ్లికి గావాల నీ సొమ్ములి' మ్మంటే సొమ్ములిచ్చేది. పెండ్లయి బొయినాక సగలమ్మ సొమ్ములు సగలమ్మ కిచ్చే వోళ్ళు ఎనిక్కి.. ఇట్ట సాయం జేచ్చాండేది. గానీ ఓ కరోజు ఒక గొల్లోడు కొండ మీద జీవాల్ని మేపుకుంటా - వాడి కూతురు పేరూ సగలమ్మే! - కూతుర్ని ఎంత బిల్చినా పలక్కుంటే 'ఓ సగలమ్మా! నీ అంకవలు బడిపోనూ.. పలకవేమే' అని కూతుర్ని తిట్నాడంట.

ఆమయిన సగలమ్మ తల్లి ఆమెనన్నాడేమోననుకోని కోపమొచ్చి 'నా అంకవలు పడిపొయ్యేది నిజమే. నువ్వు నా యెనక కుంటి యాపమానువై నిలబడేదీ నిజమే. నీ జీవాలు నల్ల రాళ్ళయి పొయ్యేదీ నిజమే' అననిందంట. ఇంగపట్నించి ఎవురు బిల్చినా పలికేది లే! సొమ్ములిచ్చేదీ లే!!'' అని ముగించింది పారవతమ్మ. వరాలు మనసులో సగలమ్మంటే భయమూ, భక్తితో కూడుకున్న భావం కలిగింది.

ముందుకెళ్ళి శంకరయ్య చంకలోంచి కోడిని తనచేతుల్లోకి తీసుకుంది.

అందరూ సగలమ్మ కట్ట చేరుకున్నారు.

గాలి హోరుమంటూ వీస్తోంది. ఆడ వాళ్ళకి ఎగిరి పోతున్న చీరల్ని పట్టుకోవడమే సరిపోయింది. గట్టిగా అరిస్తే గానీ ఒకరి మాటలు ఒకరికి వినిపించడం లేదు.

సగలమ్మ విగ్రహానికి సరిగ్గా తల మీద ఉన్న పెద్ద వేపమాను గాలికి విరుగుతుందా అన్నట్టు వూగుతోంది. సగలమ్మకు అటు మూడు, ఇటు మూడు పెనవేసుకున్న పాముల్ని చెక్కి వున్న నల్ల రాతి పలకలు వున్నాయి. ముందు విశాలంగా నల్ల బండల్తో కట్టలా కట్టి చుట్టూ మోకాలెత్తు ఇనప ఫెన్సింగ్ వుంది. ఫెన్సింగ్‌కు ముందు వైపు చిన్న తలుపు కూడా వుంది తీసుకొని వెళ్ళడానికి.

కోడిని ఆ ఫెన్సింగ్ లోపల పడేశారు. రెండు కాళ్ళు కట్టెయ్యడం వల్ల ఒక వైపుకి వొరిగి పోయి కళ్ళు మూస్తూ, తెరుస్తూ వుంది. భయం వల్ల అక్కడి నేలంతా పాడు చేసేసింది. వరాలు వొంగి ఫెన్సింగ్ ఇవతల్నించి కోడివైపే చూస్తోంది.

పారవతమ్మ ఫెన్సింగ్ లోపలికి వచ్చి విగ్రహాల్ని శుభ్రంగా కడిగి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టింది.

ఇవతల కొంచెం దూరంలో అప్పటికే సిద్ధంగా వున్న మూడు రాళ్ళ మీద బియ్యం గిన్నెను పెట్టి ''మ్మేయ్, వొరాలు, ఎండుపుల్లలు ఏరకరాయే బెరీన'' అంది చెంగమ్మ.

వరాలు ఎండు పుల్లల కోసం చెరువు కట్టెంబడి పోతూంటే చెరువు కోళ్ళు ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాయి టపటపా శబ్దం చేస్తూ. గాలి విసురు వరాలులో హద్దులేని ఆనందాన్ని కలిగించింది. వేప చెట్టు మీద రకరకాల పక్షులు చేస్తున్న శబ్దాలు! గాలి హోరు..!!

పుల్లలు ఏరుకుని వస్తూ వస్తూ ''బలపం పట్టి బేమ్మ వొళ్ళో... అ.. ఆ... ఇ... ఈ'' అని బిగ్గరగా పాడింది, కులుకుతూ.

అందరూ నవ్వేరు.

పుల్లలతో అతి ప్రయాస మీద పొయ్యి వెలిగించారు.

అన్నం పూర్తిగా వుడకక ముందే వరాలు గబగబా బెల్లం పొట్లం తెచ్చి చెంగమ్మ వారిస్తున్నా వినకుండా బెల్లం పోసేసి కాగితానికి అంటిన బెల్లాన్ని పళ్ళతో గీక్కుంటూ నిలబడింది.

అక్కడి వాతావరణం ఎంత వుత్తేజ పూరితంగా వుందంటే శంకరయ్యకు కూడా గెంతాలనిపించింది.

మూడు రావి ఆకుల్ని తెచ్చి, ఒక్కొక్క దాంట్లో కొద్ది కొద్దిగా బెల్లపన్నమూ, ఒక్కొక్క అరటి పండూ పెట్టి సగలమ్మ ముందు నైవేద్యంగా వుంచారు. విగ్రహం కిందుగా వున్న త్రికోణాకారపు గూట్లో చాలా కష్టం మీద ప్రమిదను వెలిగించారు. అగరు బత్తీలు అంటించి ఓ సిమెంటు పగులులో గుచ్చి, కర్పూరం వెలిగించింది చెంగమ్మ. వెంటనే రెండు కొబ్బరి కాయలు కొట్టి ఈశ్వరయ్య వేపు తిరిగి.

''కొయ్! కోణ్ణి కొయ్ కర్పూరం ఆరిపోతుంది. అయ్యో! నాయినా కోడికి గుది గాళ్ళు దీలా... ఏం దీలా...'' అని అరిచింది.

శంకరయ్య వుత్సాహంగా కోడి కాళ్ళకు కట్టిన తాడును కోసేస్తుంటే అంత వరకు కొబ్బరి చిప్పల కేసి చూస్తున్న వరాలు గబగబా కోడి దగ్గరికి పరిగెత్తుకొచ్చింది. పారవతమ్మ కోడిని పట్టుకుంది. శంకరయ్య ఎడం చేత్తో కోడి తలను పట్టుకుని కుడి చేతిలోని కత్తిని కోడి గొంతు మీద పెట్టాడు.

వరాలుకి కాళ్ళు శక్తిహీనంగా అయినట్టు అనిపించింది. చెమటలు పట్టిన అరిచేతుల్ని బిగబట్టుకొంటూంటే శంకరయ్య కోడి తలను కోసేసి మొండేన్ని దూరంగా విసిరేశాడు. మొండెం ఎగిరెగిరి పడుతోంది సర్కారు కంపల్లో.

చెంగమ్మ కోడి తలను తీసుకుని సగలమ్మ కట్ట మీద పెట్టింది.

చెంబుతో నీళ్ళు తీసుకుని కుడిచేతిలో వొంపుకుని విసురుగా దాని తలమీద చల్లుతూ

''పలుకు తల్లీ! పలుకు... సగలమ్మ తల్లీ పలుకు!'' అని అరిచింది.

ఆ కోడి తల రెండుసార్లు నోరు తెరిచి మూసుకుంది.

''అదో తల్లి పలికిందే. ఎర్రిముండా ఏడుస్తాండాయేమే. సగలమ్మ తల్లి పలికితే'' అంది వరాలు వేపు చూస్తూ, వుత్సాహంగా.

సగలమ్మయితే పలికింది గానీ -

తల్లి పిల్చినా వరాలు పలకలేదు.

తనకు తెలియకుండానే ఆ పిల్ల మనసులో అప్పటికే కోడికూర వాసనలు ప్రారంభమయ్యాయి.